సెబీ చైర్మన్‌గా తుహిన్ కాంత పాండే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఆర్థిక, రెవెన్యూ కార్యదర్శి తుహిన్ కాంత పాండేను స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మాధాబి పూరి బచ్ శుక్రవారంతో తన పదవికాలం ముగియనుండటంతో ఆమె స్థానాన్ని పాండేతో భర్తీ చేసింది. ప్రధాని అధ్యక్షతన అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ సమావేశమై ఈ నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయన ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగనున్నారు.

డౌన్ ట్రెండ్‌లో బంగారం, వెండి ధరలు

మరో రూ.500 దిగిన గోల్డ్ రేటు

రూ.2,100 తగ్గిన కిలో వెండి విలువ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: బంగారం, వెండి ధరలు దిగొస్తున్నాయి. దేశీయ మార్కెట్‌లో శుక్రవారం కూడా డౌన్ ట్రెండ్ కొనసాగింది. నగల వ్యాపారులు, మదుపరులు లాభాల స్వీకరణకే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో రెండు వారాల కనిష్ఠాన్ని తాకాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి 10 గ్రాములు రూ.500 తగ్గి రూ.87,700లుగా ఉన్నది. కిలో వెండి రేటు రూ.2,100 పడిపోయి రూ.96,400కు పరిమితమైంది. గురువారం పసిడి విలువ తులం రూ.1,150, కిలో వెండి రూ.1,000 దిగిన విషయం తెలిసిందే. కాగా, బంగారం ధర ఇటీవల ఆల్‌టైమ్ హైని తాకిన సంగతి విదితమే. 10 గ్రాముల మేలిమి పసిడి మునుపెన్నడూ లేనివిధంగా రూ.89,450గా నమోదైంది. అయితే గత వారం రోజులుగా తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్నది బులియన్ మార్కెట్. అయినప్పటికీ ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా చూసినట్టైతే తులం రూ.8,310 లేదా 10.5 శాతం పెరగడం గమనార్హం. జనవరి 1న రూ.79, 390గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ గోల్డ్ రూ.86,840, 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) రూ.79,600గా ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం 2,862.53 డాలర్లుగా ఉన్నది.

అల్లకల్లోలం

పతనానికి కారణాలివే..

- ట్రంప్ తాజా సుంకాల హెచ్చరికలు
- మదుపరుల్లో వాణిజ్య యుద్ధం భయాలు
- కొనసాగుతున్న ఎఫ్ఐఐల ఉపసంహరణలు
- ఒత్తిడిలో రూపాయి మారకం విలువ
- గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు



దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు ప్రవహిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. మదుపరులలో గుబులు పుట్టిస్తున్నాయి మరి. ఇప్పటికే విదేశీ ఇన్వెస్టర్లు భారతీయ మార్కెట్లకు దూరంగా జరుగుతున్న నేపథ్యంలో పెరుగుతున్న ట్రేడ్ వార్ భయాలు సూచీలను కోలుకోనివ్వడం లేదు.

స్టాక్ మార్కెట్లలో వాణిజ్య యుద్ధం భయాలు

ఒక్కరోజే రూ.9 లక్షల కోట్లకుపైగా మదుపరుల సంపద ఆవిరి

1,414 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్, 420 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

గడిచిన 5 నెలల్లో 16 శాతం వరకు నష్టపోయిన సూచీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: దేశీయ స్టాక్ మార్కెట్లను వాణిజ్య యుద్ధం భయాలు చుట్టుముట్టాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల హెచ్చరికలు.. అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేయగా, ఆ ప్రభావం భారతీయ ఈక్విటీలపైనా కనిపించింది. శుక్రవారం ఉదయం ఆరంభం నుంచే భారీ నష్టాల్లో కదలాడిన సూచీలు.. సమయం గడుస్తున్నకొద్దీ మరింతగా పతనమైపోయాయి. ఈ క్రమంలోనే ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద ఆవిరైపోయింది. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు లేదా 1.90 శాతం క్షీణించి 73,198.10 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,471.16 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 420.35 పాయింట్లు లేదా 1.86 శాతం దిగజారి 22,124.70 దగ్గర స్థిరపడింది.

టారిఫ్‌ల సెగ

అమెరికాకు దిగుమతయ్యే చైనా ఉత్పత్తులపై అదనంగా మరో 10 శాతం టారిఫ్‌లుంటాయంటూ ట్రంప్ తాజాగా చేసిన ప్రకటన.. యావత్తు మార్కెట్లలో ప్రకంపనల్ని సృష్టించింది. కేవలం దీనివల్లే భారతీయ సూచీలు 2 శాతం వరకు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఇప్పటికే పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాల నుంచి వచ్చే దిగుమతులపై 25 శాతం సుంకాలుంటాయని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. కాగా, తరలిపోతున్న విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ట్రంప్ దూకుడుతో అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆందోళనలు కూడా ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలహీనపర్చాయి. ట్రంప్ నిర్ణయాలు.. అమెరికాపై ప్రతీకార సుంకాలకు దారితీయవచ్చన్న గుబులు దేశ, విదేశీ మదుపరులను వెంటాడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అమ్మకాల ఒత్తిడిలో ఐటీ

టెక్ మహీంద్రా షేర్ విలువ అత్యధికంగా 6 శాతానికిపైగా నష్టపోయింది. ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు నిరాశపర్చాయి. అలాగే ఇండస్ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, మారుతి, టాటా మోటర్స్, టైటాన్, నెస్లే షేర్లూ పడిపోయాయి. రంగాలవారీగా టెక్, ఐటీ సూచీలు 4.20 శాతం, టెలికం, 4.09 శాతం, ఆటో 3.84 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 2.74 శాతం, చమురు-గ్యాస్ 2.61 శాతం, పవర్ 2.29 శాతం చొప్పున పతనమయ్యాయి. ఇక ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు భారీ నష్టాలనే మూటగట్టుకున్నాయి. అమెరికా, ఐరోపా స్టాక్ మార్కెట్లూ ఇదే దారిలో పయనిస్తున్నాయి.

- గత ఏడాది సెప్టెంబర్ 27న సెన్సెక్స్ 85,978.25 పాయింట్ల ఆల్‌టైమ్ హైని తాకింది. ఇదే రోజున నిఫ్టీ కూడా 26,277.35 పాయింట్ల లైఫ్‌టైమ్ హైని చేరింది.
- గడిచిన 5 నెలల్లో సెన్సెక్స్ 12,780.15 పాయింట్లు లేదా 14.86 శాతం, నిఫ్టీ 4,152.65 పాయింట్లు లేదా 15.80 శాతం నష్టపోయాయి.
- గత 5 నెలల్లో బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.93.91 లక్షల కోట్లు హరించుకుపోయింది. నిరుడు సెప్టెంబర్ ఆఖర్లో రికార్డు స్థాయిలో రూ.478 లక్షల కోట్లుగా ఉన్నది.
- ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.1.20 లక్షల కోట్ల వరకు పెట్టుబడులను ఉపసంహరించుకున్న విదేశీ సంస్థాగత మదుపరులు.

రూ.9,08,799 కోట్లు

వరుస నష్టాల నడుమ బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.384 లక్షల కోట్లకు పరిమితమైంది. శుక్రవారం ఒక్కరోజే రూ.9,08,798.67 కోట్లు పడిపోగా.. రూ.3,84,01,411.86 కోట్లకు తగ్గింది. గడిచిన 5 నెలల్లో రూ.93.91 లక్షల కోట్లు క్షీణించింది. నిరుడు సెప్టెంబర్ ఆఖర్లో ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.4,77,93,022.68 కోట్లుగా ఉండటం గమనార్హం. దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులతో మదుపరులు భయాందోళనకు గురవుతున్నారని, ఎఫ్ఐఐలతోపాటు దేశీయ సంస్థాగత మదుపరులూ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారని మార్కెట్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరికొద్ది రోజులు ఇలాగే ఉంటుందన్న అంచనాలూ వస్తున్నాయి.

కార్మిక క్షేత్రంలో మరో మకుటం

కేటీఆర్ చొరవతో ముందుకొచ్చిన వస్త్ర పరిశ్రమలు

- ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్
- టీ-షర్టులు, జీన్స్ ప్యాంట్స్ తయారీలో అంతర్జాతీయ ఖ్యాతి
- సిరిసిల్ల జిల్లాలో రెండువేల మందికి లభించనున్న ఉపాధి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): వస్త్ర నగరిగా ఖ్యాతి పొందిన సిరిసిల్ల సిగలో మరో మణిహారం చేరింది. జిల్లాలోని మహిళలు, యువతులకు ఉపాధి కల్పించాలన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షతో రూపుదిద్దుకున్న అపారెల్ పార్కులో అంతర్జాతీయ వస్త్ర తయారీ దిగ్గజ సంస్థ టెక్స్‌పోర్ట్ తమ పరిశ్రమను ప్రారంభించడానికి సిద్ధమైంది. దీంతో టీ షర్టులు, జీన్స్ ప్యాంట్ల తయారీలో రెండు వేల మందికి ఉపాధి లభించనున్నది. ఇప్పటికే గోకుల్‌దాస్ సంస్థ ప్రారంభించిన గ్రీన్ నీడిల్ యూనిట్‌లో వెయ్యి మంది మహిళలు, యువతులు ఉపాధి పొందుతుండగా, ఇప్పుడో మరోసారి భారీ ఎత్తున ఉపాధి లభిస్తున్నందుకు జిల్లా ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతున్నది.

65 ఎకరాల్లో అపారెల్ పార్క్

మరమగ్గాల వస్త్ర పరిశ్రమలో తెలంగాణకే తలమానికమైన సిరిసిల్లలో మహిళలు, యువతులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో సిరిసిల్లకు మహర్దశ వచ్చింది. బతుకమ్మ చీరెల ఆర్డర్లతో నేతన్నలకు బతుకు చూపింది. బీడీలపై ఆధారపడి పొగచూరిన బతుకుల్లో వెలుగులు నింపాలన్న సంకల్పంతో అప్పటి చేనేత, జౌళిశాఖ మంత్రి కేటీఆర్ జిల్లా కేంద్రంలోని రెండో బైపాస్‌రోడ్డులో రూ.175 కోట్లతో 65 ఎకరాలలో అధునాతన హంగులతో అపారెల్ పార్కును నిర్మించారు. అంతర్జాతీయ కంపెనీలతో పెట్టుబడులు పెట్టించేలా చర్యలు తీసుకున్నారు. 2021 జూలై 30న పార్కులో గోకుల్‌దాస్ ఇమేజ్ కంపెనీ షెడ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. రెండేండ్ల వ్యవధిలోనే ఆ కంపెనీ లోదుస్తుల ఉత్పత్తిని ప్రారంభించి వెయ్యి మంది మహిళలకు ఉపాధినిచ్చింది.

టీషర్టులు, జీన్స్ ప్యాంట్ల తయారీలో టెక్స్‌పోర్ట్

రెండు వేల మంది మహిళలు, యువతులకు ఉపాధి కల్పించేందు మరో దిగ్గజ రెడీమేడ్ సంస్థ ముందుకు వచ్చింది. టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ 2021లో మాజీ మంత్రి కేటీఆర్ చొరవతో అప్పారెల్ పార్కులో 7.41 ఎకరాలలో రూ.75 కోట్లతో షెడ్ల నిర్మాణం చేపట్టింది. పంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట యూనిట్‌ను ఏర్పాటు చేసింది. అధునాతన హంగులతో షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఆ సంస్థ ఇప్పుడు ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే రెండువేల అత్యాధునిక కుట్టు మిషన్లు, ప్రాసెసింగ్, తదితర మిషన్లు తెప్పించింది. ఇందులో టీ-షర్టులు, జీన్స్ ప్యాంట్స్ తయారు కానున్నాయి. విదేశాల నుంచి తెప్పించిన మిషన్లపై మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ అధికారులు తెలిపారు. బెంగుళూరుకు చెందిన టెక్నికల్ సిబ్బంది, కుట్టులో నైపుణ్యత కలిగిన డిజైనర్లను నియమించింది. కుట్టు శిక్షణలో నైపుణ్యం పొందిన జిల్లా మహిళలకు సూపర్‌వైజర్లుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నది. కంపెనీకి చెందిన డైరెక్టర్లు ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

జిల్లా మహిళలకే ఉపాధి

అపారెల్ పార్కులో మొత్తం పదివేల మందికి ఉపాధి కల్పించాలన్నది మాజీ మంత్రి కేటీఆర్ సంకల్పం. అందులో జిల్లాకు చెందిన వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే గోకుల్‌దాస్ ఏర్పాటు చేసిన గ్రీన్‌నిడిల్ యూనిట్‌లో వెయ్యి మంది సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు చెందిన మహిళలు, యువతులే ఉన్నారు. వీరిని కంపెనీకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక బస్సులను కంపెనీ ఏర్పాటు చేసింది. సిరిసిల్ల టెక్స్‌టైల్స్ పార్కులో జాకీ కుట్టు మిషన్లపై దుస్తుల తయారీలో ప్రభుత్వమే వందలాది మంది మహిళలు, యువతులకు ఉచిత శిక్షణ ఇచ్చింది. ప్రస్తుతం 3500 మంది సుశిక్షితులైన వారికి త్వరలో ప్రారంభించబోయే టెక్స్‌పోర్టు కంపెనీలో ఉపాధి కల్పించనున్నారు. మధ్యమానేరు ప్రాజెక్టు నిర్వాసితులైన యువతులు, మహిళలు, బీడీ కార్మికులకే ఉపాధి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో మహిళలు, యువతులు రానుపోను బస్సు సౌకర్యం కంపెనీలే కల్పిస్తున్నాయి. ఇంకా అనేక దిగ్గజ రెడీమేడ్ కంపెనీలు సిరిసిల్లకు రానున్నట్టు అధికారులు చెబుతున్నారు.

టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రత్యేకతలు

- కొత్తగా ప్రారంభించనున్న టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ అంతర్జాయ ప్రమాణాలతో ఉత్పత్తులు చేస్తుంది
- 1978 నుంచి రెడీమెడ్ రంగంలో అడుగు పెట్టింది
- నాణ్యమైన ఉత్పత్తులు, ఎగుమతులతో సుదీర్ఘమైన అనుభవం కలిగి ఉంది
- ఏటా 17 మిలియన్లకు పైగా దుస్తుల ఉత్పత్తులు చేస్తున్నది
- దేశవాప్యంగా ఇప్పటికి 19 కంపెనీలు ఉండగా, సిరిసిల్లలో స్థాపిస్తున్నది 20వది.
- రూ.620 కోట్ల వార్షిక ఆదాయంతో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నది.

యూపీఐ లావాదేవీల రికార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: దేశవ్యాప్తంగా యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. జనవరి నెలలో 1,699 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయని, వీటి విలువ రూ.23.48 లక్షల కోట్లుగా ఉన్నదని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఒక నెలలో ఇంతటి స్థాయిలో లావాదేవీలు జరగడం ఇదే తొలిసారని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,31,00 కోట్ల యూపీఐ లావాదేవీలు జరగగా, వీటి విలువ రూ.200 లక్షల కోట్లకు పైగా ఉన్నదని తెలిపింది. ప్రస్తుతం మార్కెట్లో 80 యూపీఐ యాప్స్, 641 బ్యాంకులు యూపీఐ ఎకోసిస్టాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు జరిపేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని తెలిపింది.

హెడ్జింగ్‌కు డెరివేటివ్‌లు

ఇన్సూరర్లకు ఐఆర్డీఏఐ ఊరట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ.. ఇన్సూరెన్స్ కంపెనీలు తమ పోర్ట్‌ఫోలియోల హెడ్జింగ్‌కు ఈక్విటీ డెరివేటివ్‌లను వాడుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఈక్విటీ డెరివేటివ్‌ల ద్వారా హెడ్జింగ్‌పై మార్గదర్శకాలను విడుదల చేస్తూ అనుమతిచ్చింది. ప్రస్తుతం క్యాపిటల్ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకుల్లో కదలాడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మార్కెట్‌లోని బీమా సంస్థల రిస్క్‌ను తగ్గించడానికి ఐఆర్డీఏఐ ఈ తాజా నిర్ణయం తీసుకున్నది. నిజానికి ఇన్సూరెన్స్ కంపెనీలే ఈ ప్రతిపాదనను చేశాయి. దీంతో ఐఆర్డీఏఐ దానికి ఆమోదం తెలిపింది.

మీ సేవా కేంద్రంలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 28: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లోని శ్రీరామ మీ సేవా కేంద్రంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. రెవెన్యూ అధికారులను కూడా పిలిపించి వివరాలు సేకరించారు. సిస్టమ్ రికార్డులతో పాటు మీ సేవా కేంద్రంలోని కంప్యూటర్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలించారు. ధరణిలో చేసిన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల వివరాలు, మీ సేవా కేంద్రానికి వచ్చిన దరఖాస్తులు, జారీ చేసిన సర్టిఫికెట్లు, నగదు చెల్లింపులు, తదితర వివరాలు సేకరించినట్లు సమాచారం. క్యూఆర్ కోడ్ ద్వారా లావాదేవీలు నిర్వహించాల్సి ఉండగా, నగదు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు?. మీ సేవా లైసెన్స్, రికార్డులను పరిశీలించారు. మీ సేవా కేంద్రం లైసెన్స్, మరికొన్నింటికి సంబంధించిన లావాదేవీల జిరాక్స్ ప్రతులు అధికారులు తీసుకెళ్లినట్లు నిర్వాహకుడు అశోక్ తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి ఎస్ అచేశ్వర్‌రావు, ఎస్ఐ రవీందర్, తహసీల్దార్ దినేశ్ చంద్ర, ఏఈఈ వరప్రసాద్, ఆర్ఐ వాస్తవిక్, జిల్లా మేనేజర్ శ్రీరాం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్, ఫిబ్రవరి 28: నగరంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీ రిజర్వాయర్ పరిధిలో శనివారం నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్ పైప్ లైన్ లీకేజీ మరమ్మతులు చేస్తున్నందున నేటి సరఫరా ఉండదని తెలిపారు.

కాంట్రాక్టర్‌పై ఈఈ ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 28 : కరీంనగర్ నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్‌పై బల్దియా ఈఈ రొడ్డ యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న తన చాంబర్‌లో పనులు చేసుకుంటుండగా కాంట్రాక్టర్ వరాల నారాయణ మరి కొంత మంది కాంట్రాక్టర్లతో కలిసి వచ్చి అతని పనులకు సంబంధించిన విషయంలో రికార్డు కావడం లేదని చెప్పాడని, దీనికి కిందిస్థాయి ఏఈ, డీఈలను కలవాలని సూచించినట్లు పేర్కొన్నారు. అయితే, వాటిని వినిపించుకోకుండా ఇష్టం వచ్చినట్లు తిడుతూ తనను కించపర్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట టౌన్(హుజూరాబాద్ టౌన్), ఫిబ్రవరి 28 : మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన సాన శ్రీకాంత్ (36) ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మడిపల్లికి చెందిన శ్రీకాంత్ జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఏరియాలో నివాసం ఉంటూ చిరు వ్యాపారులకు డబ్బులు ఫైనాన్స్ చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇటీవల కొంతమంది అతని వద్ద డబ్బులు అప్పుగా తీసుకొని, వారు సక్రమంగా తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో ప్రతిరోజు బాధపడేవాడని, దీంతో ఆర్థికంగా నష్టం చవిచూడాల్సి వస్తున్నదని ఆందోళన చెంది శుక్రవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి జమ్మికుంట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించడంతో 3 గంటల ప్రాంతంలో మరణించినట్టు తెలిపారు. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జమ్మికుంట సీఐ వరిగంటి రవి తెలిపారు.

ఈతకు వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్ మృతి



తిరుపతిరావు(ఫైల్)

కరీంనగర్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ఎండీ రిజర్వాయర్‌లో శుక్రవారం ఈతకు వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్ కటారి తిరుపతిరావు (59) ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. కరీంనగర్‌లోని అల్కాపురికాలనీకి చెందిన తిరుపతిరావు కోరుట్ల ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన ప్రతిరోజూ ఎల్ఎండీలో వాకింగ్ చేసి ఈత కొడుతాడు. ప్రతిరోజూ లాగానే శుక్రవారం ఉదయం నడక పూర్తయిన తరువాత జలాశయంలోకి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కొత్తపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల విధులు ముగించుకుని వెళ్తూ..

- రెండు బస్సులు ఢీకొని 19 మందికి గాయాలు
- జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ వద్ద ప్రమాదం
- క్షతగాత్రులు నిర్మల్ జిల్లాకు చెందిన వారుగా గుర్తింపు
- కరీంనగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచి వెళ్తుండగా ఘటన
- క్షతగాత్రులకు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స
- పరామర్శించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

క్షతగాత్రులను పరామర్శిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, వైద్యాధికారులు

కరీంనగర్ విద్యానగర్/కొడిమ్యాల, ఫిబ్రవరి 28 : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలకొండ గ్రామ శివారులో రైల్వే గేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో 19 మందికి గాయాలయ్యాయి. కొడిమ్యాల ఎస్ఐ సందీప్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా నిర్మల్, భైంసా డిపోలకు చెందిన రెండు ఆర్టీసీ బస్సుల్లో ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌కు తీసుకొచ్చి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. శుక్రవారం తెల్లవారుజామున తిరిగి వెళ్తున్న క్రమంలో కొడిమ్యాల మండలం నమిలకొండ రైల్వే ట్రాక్ వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో ముందు వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న భైంసా డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో 19 మందికి గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లాకు చెందిన క్షతగాత్రులను స్థానికులు కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇందులో 17 మందికి స్వల్పగాయాలు కాగా ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. పురుషోత్తం (ఎన్నికల సిబ్బంది), మొయినొద్దీన్ (డ్రైవర్)ను మెరుగైన చికిత్స కోసం హయ్యర్ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు. ఉదయం ప్రమాదం జరిగిన వెంటనే కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ గుండా వీరారెడ్డికి ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో వెంటనే అప్రమత్తమైన సూపరింటెండెంట్, ఆర్ఎంవో డాక్టర్ నవీన దవాఖానలో వార్డును సిద్ధం చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించారు. కోలుకున్న 17 మందిని డిశ్చార్జ్ చేయగా, మరో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం హయ్యర్ సెంటర్‌కు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. అలాగే, వేగంగా స్పందించి వైద్య సేవలందించిన కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బందిని నిర్మల్, కరీంనగర్ కలెక్టర్లు అభినందించారు. కాగా, నిర్మల్ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ అజ్మీర దశరత్ అతివేగంగా, అజాగ్రత్తగా బస్సు నడుపుతూ సడెన్ బ్రేక్ వేయగా ప్రమాదం జరిగిందని భైంసా డిపో డ్రైవర్ మొయినొద్దీన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కొడిమ్యాల ఎస్ఐ సందీప్ తెలిపారు.

అద్దె బస్సు డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ తెలంగాణచౌక్, ఫిబ్రవరి28 : కరీంనగర్ -1 డిపో ఎదుట అద్దె బస్సు డ్రైవర్ శుక్రవారం ఆత్మహత్యకు యత్నించాడు. డబ్బాలో తెచ్చుకున్న పెట్రోల్ పోసుకుంటుండగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది నీళ్లు పోసి కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. చొప్పదండి మండలానికి చెందిన సురేశ్ అనే అద్దె బస్సు డ్రైవర్ అనంతపల్లి రూట్ పల్లెవెలుగు బస్సు డ్రైవరగా విధులు నిర్వర్తించేవాడు. గత సెప్టెంబర్ నెలలో డ్యూటీకి వచ్చిన సురేశ్‌ను రోజు వారి తనిఖీలో భాగంగా బ్రీత్ ఎనలైజ్ టెస్టు చేయగా 93 శాతం పర్సెంటేజ్ వచ్చింది. ఆర్టీసీ నింబంధన ప్రకారం డ్యూటీ ఇవ్వకుండా పక్కకు పెట్టారు. డ్యూటీలో చేర్చుకోవాలని అధికారులను వేడుకోగా నివేదిక రాకపోవడంతో అధికారులు డ్యూటీ ఇవ్వలేదని, దీంతో జీతం రాక ఆరునెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కార్మిక యూనియన్ నాయకులు తెలిపారు. దీంతో మనోవేదనకు గురైన సురేశ్ డిపో-1 ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని చెప్పారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 28 : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్‌పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేయగా, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పాల్గొన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తయిందని, ప్రశ్నా పత్రాలు చేరుకున్నాయని, రేపటి నుంచి ప్రశ్నాపత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లో నుంచి పోలీస్ స్టేషన్లకు చేరుతాయని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉండాలని, పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యార్థులను పూర్తిగా చెక్ చేసి లోపలికి అనుమతించాలని స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ - 2020 కింద 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని, గత సెప్టెంబర్ 2024 లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ మాత్రమే జరిగిందన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎల్ఆర్ఎస్ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుం చెల్లించి క్రమబద్ధికరణ చేసుకోవచ్చని తెలిపారు.

నవ కవులకు పురస్కారం ప్రోత్సాహం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 28 : నవ కవులకు పురస్కారం ప్రోత్సాహంగా ఉంటుందని డాక్టర్ గండ్ర లక్ష్మణరావు తెలిపారు. కళాశ్రీ సాహితీ పురస్కారానికి కాందూరి వెంకటేశ్వర్లు ఎంపికవ్వగా, శుక్రవారం సాయంత్రం కవి ఇంటికి వెళ్లి నిర్వాహకుడు గుండేటి రాజు, కొత్త అనిల్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ కళాశ్రీ పురస్కారం ద్వారా కళా సేవలు నవ తరాలకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నారని తెలిపారు. వారి సేవలు ఇంకా కొనసాగాలని ఆకాంక్షించారు. ఇక్కడ నిర్వాహకులు చిందం సునీత, అయిత అనిత, లక్కరాజు శ్రీలక్ష్మి, మూలస్తం లావణ్య, మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంత చార్య, వంగ గీతారెడ్డి, గాజుల రవీందర్, బొమ్మకంటి కిషన్, డాక్టర్ కల్వకుంట రామకృష్ణ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులతో సీపీ అభిషేక్ మొహంతి

ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యం

- సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమని కరీంనగర సీపీ అభిషేక్ మొహంతి పేర్కొన్నారు. కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జరిగిన పలువురు ఉద్యోగుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నో సవాళ్లతో కూడుకున్న పోలీసు ఉద్యోగం సంపూర్ణం చేసి పదవీ విరమరణ పొందడం గొప్ప అవకాశమన్నారు. పోలీసుల సేవల, వెనుక కుటుంబ సభ్యుల సహకారం కూడా ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖకు 35 ఏళ్ల సేవలు అందించిన కమ్యూనికేషన్ విభాగం ఎస్ఐ జీ నరసింహారావు, 41 ఏళ్ల పాటు సేవలు అందించిన సీసీఆర్బీ ఎస్ఐ ఎండీ మన్సూర్, 40 ఏళ్లపాటు సేవలు అందించిన కరీంనగర రూరల్ ఎస్ఐ అంజయ్యను సీపీ అభిషేక్ మొహంతి ఘనంగా సన్మానించారు. ఇక్కడ అడిషనల్ డీజీపీ ఏ లక్ష్మీనారాయణతోపాటు సీసీఆర్బీ ఏసీపీ విజయ్‌కుమార్, రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎస్ఐ మామిడి సురేందర్, తదితరులు పాల్గొన్నారు..

5 కిలోమీటర్లు.. 200 లారీలు

చల్లూరు నుండి పచ్చునూరు వరకు బారులు తీరిన లారీలు

- వన్‌వే ప్రయాణంతో ప్రమాదాలు
- ఆర్టీసీ బస్సులకు సవాల్‌గా లారీలు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

వీణవంక, ఫిబ్రవరి 28 : ప్రభుత్వ ఇసుకరీచ్‌లో ఆన్‌లైన్‌లో టోకెన్ తీసుకున్న వారు వారివంతు కోసం వాహనాలను క్యూలో పెట్టి రోజుల తరబడి ఎదురుచూస్తుండడంతో ఇతర ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తున్నది. వీణవంక మండలంలోని చల్లూరు, మల్లారెడ్డిపల్లిలో రెండు, కొండపాకలో రెండు, కోర్కల్‌లో ఒకటి, పోతిరెడ్డిపల్లిలో రెండు మొత్తం 7 ఇసుక క్వారీలు ఉండగా నూతన ఇసుక పాలసీ విధానంతో కేవలం చల్లూరు ఇసుక క్వారీ మాత్రమే నడుస్తున్నది. దీంతో ఆ క్వారీ నుంచి కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి చల్లూరు గ్రామ శివారు నుంచి మానకొండూరు మండలం పచ్చునూరు వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర 200 లారీలు రోడ్లపై నిలిచి ఉంటున్నాయి. తమవంతు కోసం లారీ డ్రైవర్‌లు రోజుల తరబడి రోడ్లపై పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఉండగా మరో వైపు వన్‌వేతో ఆర్టీసీ బస్‌లతోపాటు ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మామిడాలపల్లిలో గ్రామ బస్టాండ్ నుంచి చివరి వరకు నాలుగు మూలమలుపులు ఉండడంతో లారీలు ఓవైపు, ఆర్టీసీ బస్‌లు మరోవైపు, కార్లు, తదితర వాహనాలలో ఏ ఒక్కటి అదుపుతప్పినా ప్రమాదం జరిగి ట్రాఫిక్‌జామ్ అవుతున్నది. తాజాగా, గురువారం రాత్రి ఆర్టీసీ బస్ అదుపుతప్పి కారును ఢీకొనడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌జామ్ అయింది. ఉదయం, సాయంత్రం కరీంనగర్, జమ్మికుంటకు కళాశాలకు వెళ్ళే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్ళే వారు లారీలతో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా అధికారులకు చెప్పినా ఎలాంటి స్పందన లేదని మండిపడుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కరీంనగర్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖాన ఎదుట ఫుట్‌పాత్‌పై నిత్యం పడుకునే సుమారు 65 నుంచి 70 ఏళ్ల వృద్ధుడు శుక్రవారం మృతి చెందినట్లు టూ టౌన్ పోలీసులు గుర్తించారు. ఇతని మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపర్చారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ 8712670762కు గానీ, హెడ్ కానిస్టేబుల్ 9491481433 నంబర్‌కుగానీ ఫోన్ చేసి వివరాలు తెలపాలని కోరారు.